క్లుప్తంగా

నేడు, రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

నర్సీపట్నం: కొత్తగా విద్యుత్ టవర్లు నిర్మిస్తున్నందున డివిజన్ పరిధిలో రెండు రోజుల పాటు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామకృష్ణ మంగళవారం తెలిపారు. పాయకరావుపేట, పెద్దాపురం 132 కేవీ లైన్‌లలో నూతనంగా టవర్లు నిర్మిస్తున్నారన్నారు. వీటి నిర్మాణంతో పెదబొడ్డేపల్లి, బలిఘట్టం, మాకవరపాలెం, రోలుగుంట, కోటవురట్ల, నాతవరం, పాములవాక, కన్నూరుపాలెం, గొలుగొండ, ఏటిగైరంపేట, కె.డి.పేట 33/11 కేవీ సబ్ స్టేషన్ల పరిధిలో ఈ నెల 22, 23 తేదీల్లో (త్రీ ఫేస్) విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

కుల గణనపై శిక్షణ

మాకవరపాలెం: త్వరలో ప్రారంభించనున్న కుల గణనపై మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీతామహాలక్ష్మి శిక్షణ ఇచ్చారు. కులాల వారీగా వివరాల నమోదుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని ఆమె సూచించారు. ఈ శిక్షణలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె నోటీసు

నర్సీపట్నం: అంగన్‌వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే సమ్మె బాట తప్పదని అంగన్‌వాడీ అసోసియేషన్(ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు ఎం. అప్పలరాజు హెచ్చరించారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె నోటీసును ఐసీడీఎస్ సీడీపీవో మేరీ సువార్తకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ కనీస వేతనాలు, ఐదేళ్ల పెండింగ్ బిల్లులపై ప్రభుత్వం స్పందించాలన్నారు. లేని పక్షంలో సమ్మెకు వెళ్తమన్నారు. కార్యకర్తలు మహాలక్ష్మి, వరలక్ష్మి, దేవి, కృష్ణవేణి, ఆశాజ్యోతి, మణి, శోభారాణి, వరలక్ష్మి పాల్గొన్నారు.

చౌడువాడలో అన్నసమారాధన



భక్తులకు వడ్డన చేస్తున్న రాజి శ్రీనివాసరావు

కె.కోటపాడు: చౌడువాడలో షిర్డీసాయిబాబా మందిర 27వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి సాయినాథుడికి పూజలు చేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, గోవాడ సుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు, సాయి యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అభ్యసనాభివృద్ధి కార్యక్రమం పక్కాగా అమలు



మాట్లాడుతున్న ఎంఈవో తలుపులు

నర్సీపట్నం: అభ్యసనాభివృద్ధి కార్యక్రమాన్ని పాఠశాల్లో విధిగా అమలు చేయాలని ఎంఈవో సిహెచ్. తలుపులు పేర్కొన్నారు. పెదబొడ్డేపల్లి జెడ్పీ హైస్కూల్‌లో మంగళవారం జరిగిన ఇంగ్లిష్ స్కూల్ కాంప్లెక్స్ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లెర్నింగ్ ఇంప్రూమెంట్ ప్రొగ్రాంను నూటికి నూరుశాతం అమలు చేసి, విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎంలు లక్ష్మీబాయి, ఇంగ్లిష్ ఆర్పీ లు వై.జానకిరామునాయుడు, కె.గణేశ్వరరావు, నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ మండలాల ఆంగ్ల ఉపాధ్యాయులు వి.అప్పారావు, పి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

గౌరీపరమేశ్వరులకు ప్రత్యేక పూజలు

మాడుగుల రూరల్: కె.జె.పురం కళావేదికపై గౌరీపరమేశ్వరులకు సర్పంచ్ జామి రమణబాబు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. పంచాయతీ పాలకవర్గ సభ్యులు, భక్తులు సహకారంతో వచ్చే నెల 2వ తేదీ వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని సర్పంచ్ తెలిపారు. సాయంత్రం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.



వేనోళ్ల ప్రశంస..



నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే రోడ్డు అది. మూడు మండలాల ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండేది. గత టీడీపీ పాలకుల నిర్లక్ష్యం మూలంగా అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడ పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. పర్యవసానంగా ఎంతోమంది రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. దాంతో పలుమార్లు ధర్నాలు... ఆందోళనలు చేసినా ప్రయోజనం లేకపోయింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కశింకోట- బంగారుమెట్ట(కేబీ) రోడ్డుకు మోక్షం కలిగింది. ఏడాదిలోనే శరవేగంగా నిర్మాణం పూర్తి కావడంతో ప్రయాణికుల రవాణా కష్టాలు తొలగడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

రోడ్డు పేరు : కశింకోట-బంగారుమెట్ట (కేబీరోడ్డు)
కిలోమీటర్లు **24**
వెచ్చించిన నిధులు **32** కోట్లు
పెరిగిన రోడ్డు విస్తరణ **12 నుంచి 30 అడుగులు**
రవాణా కష్టాలు తొలిగిన గ్రామాలు **30**
ఏయే మండలాలకు లబ్ధి **బుచ్చెయ్యపేట, కశింకోట, మాడుగుల**
గతంలో నిర్మించిన సంవత్సరం **1989&91**
ప్రస్తుత రోడ్డు పునర్నిర్మాణ సంవత్సరం **2023**

- మారిన కేబీ రోడ్డు రూపురేఖలు
- రూ.32 కోట్లతో విస్తరణ
- ప్రయాణికులకు తప్పిన ప్రమాదాలు, ట్రాఫిక్ జామ్
- బుచ్చెయ్యపేట నుంచి అనకాపల్లికి మెరుగుపడ్డ సౌకర్యం



బుచ్చెయ్యపేట జంక్షన్‌లో విశాలంగా ఏర్పాటు చేసిన సిమెంట్ రోడ్డు



కందిపూడి వద్ద ఏర్పాటు చేసిన మదుం



గతంలో గోతులమయంగా కేబీ రోడ్డు

బుచ్చెయ్యపేట: కశింకోట- బంగారుమెట్ట(కేబీ) రోడ్డు బాగుపడింది. దశాబ్ద కాలంగా ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న బుచ్చెయ్యపేట, రావికమతం, మాడుగుల మండలాలకు చెందిన 30 గ్రామాల ప్రజలకు సుఖ ప్రయాణం కలిగింది. గత టీడీపీ హయాంలో శిథిలమైన ఈ రోడ్డును బాగు చేయాలని పలు గ్రామాల ప్రజలు ధర్నాలు, ఆందోళనలు చేసినా అప్పటి నాయకులు, అధికారులు పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించి రూ. 32 కోట్లు మంజూరు చేశారు. గతంలో 12 అడుగులతో ఇరుకుగా ఉండే రోడ్డును వెడల్పు చేసి బెర్మలు ఏర్పాటు చేసి 30 అడుగుల మేర విస్తరించారు. బుచ్చెయ్యపేటతోపాటు జిల్లా కేంద్రం అనకాపల్లికి వెళ్లడానికి పలు గ్రామాల ప్రజలకు రహదారి సౌకర్యం మెరుగుపడింది.

ఆర్టీసీ బస్సు సర్వీసుల పునరుద్ధరణ..

శిథిలమైన మదుంలను తొలగించి కొత్తగా విశాలంగా ఉండేలా కొత్తవి ఏర్పాటు చేశారు. గతంలో కేబీ రోడ్డు అంతా గోతుల మయంగా మారడంతో అనకాపల్లి నుంచి రావికమతం, పెదమదీనకు తిరిగే ఆర్టీసీ బస్సులను నడపలేక రాకపోకలు నిలిపివేశారు. ఇప్పుడు వైఎస్సార్‌సీపీ హయాంలో రోడ్డు పూర్తి కావడంతో బస్సు సర్వీసులను పునరుద్ధరించారు.

గతంలో నిత్యం ప్రమాదాలు...

గోవాడ, తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీలకు చెరుకును తీసుకెళ్లే ట్రాక్టర్లు, లారీలు గోతుల్లో పడి బోల్తా పడగా పలు ప్రమాదాలు జరిగాయి. రాజాం, పెదమదీన జంక్షన్‌ల మధ్య పెద్ద గోతుల్లో కార్లు, ఆటోలు బోల్తా పడ్డ ప్రమాదాల్లో కరకకు చెందిన నవ వధువుతోపాటు గాజువాక ప్రాంతానికి చెందిన ఇద్దరు యువకులు మృతి చెందారు. పలు బైక్‌లు, ఆటోలు ఇతర వాహనాలు ప్రమాదాలకు గురై పలువురికి కాళ్లు, చేతులు విరిగి ప్రమాదాల బారిన పడ్డారు. ప్రస్తుతం రోడ్డు బాగు చేసి విస్తరించడంతో ప్రమాదాలు తగ్గాయి.

మా ఇంటి ముందే పలు ప్రమాదాలు



మా ఇంటి ముందే పెద్ద పెద్ద గోతులు ఉండేవి. గోతుల్లో వాహనాలు కూరుకుపోయి ట్రాఫిక్ నిలిచిపోయేది. అప్పట్లో రాత్రిపూట గోతులు కనిపించక వాహనదారులు గోతుల్లో పడి ప్రమాదాలకు గురయ్యేవారు. రోజూ క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించడానికి తీవ్ర అవస్థలు పడేవారిమి. వైఎస్సార్ ప్రభుత్వంలో రోడ్డు బాగు చేసి సుఖ ప్రయాణం కలిగించారు. విప్ కరణం ధర్మశ్రీకి రుణపడి ఉంటాం.

– యన్నెంశెట్టి రవి, నీలకంఠాపురం గ్రామస్తుడు

టీడీపీ హయాంలో బస్సులు నిలిపివేత



గత టీడీపీ హయాంలో కేబీ రోడ్డు శిథిలమై వాహనాలు బురదలో కూరుకు పోయి బోల్తా పడేవి. దాంతో అధికారులు ఆర్టీసీ బస్సులను నిలిపి వేశారు. ఐదారుసార్లు కేబీ రోడ్డుపై బైఠాయించి రోడ్డును బాగు చేయాలని, బస్సులను నడపాలని ధర్నాలు, ఆందోళనలు చేసినా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిధులు మంజూరు చేసి రోడ్డు బాగు చేయడంతో రవాణా కష్టాలు తప్పాయి.

– జోగా కొండబాబు, పెదమదీన గ్రామస్తుడు

నాణ్యతా ప్రమాణాలతో నిర్మాణం



కేబీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ వేగవంతంగా పూర్తి చేశాం. 24 కిలోమీటర్ల మేర రోడ్డు పొడవులో నాలుగు కిలోమీటర్ల మేర సీసీ, 20 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు ఏర్పాటు చేశాం. దెబ్బతిన్న 38 కల్వర్టులు, మదుములను తొలించి కొత్తవి వేశాం. ప్రమాదాల నివారణకు రోడ్డు బెర్మలతో కలిసి 30 అడుగుల వెడల్పుతో రోడ్డు ఏర్పాటు చేశాం.

– ధనంజయ్, డీఈ, అనకాపల్లి డివిజన్

బూత్ కమిటీలు ఏర్పాటు చేయండి

కార్యకర్తల సమావేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: బూత్ కమిటీల ఏర్పాటుపై గ్రామస్థాయి నాయకులు పూర్తి స్థాయిలో దృష్టిసారించాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశించారు. సర్పంచ్ శానాపతి రాజశేఖర్ అధ్యక్షతన ఖండిపల్లిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయి నాయకులంతా కలిసిమెలసి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎటువంటి మనస్పర్థలకు తావులేకుండా రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి చైతన్య పరచాలన్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రతీ పోలింగ్ బూత్‌కు కమిటీలు వేసేటప్పుడు పార్టీకి అంకితభావంతో పనిచేసే వారిని నియమించాలని సూచించారు. అదేవిధంగా అర్హులైన వారిని కొత్త ఓటర్లుగా నమోదుతోపాటు అనర్హ ఓటర్లను గుర్తించి తొలగించడానికి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. కోఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షుడు శానాపతి సత్యారావు, ఏఎంసీ చైర్మన్ ఏడువాక సత్యారావు, డీసీఎంఎస్ చైర్మన్ పల్లా నర్సింగరావు, మాజీ జెడ్పీటీసీ బొడ్డేడ సూర్యనారాయణ, మండల సచివాలయ కన్వీనర్ పతివాడ అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, దామునాపల్లి, లక్కవరం సర్పంచ్‌లు బలిరెడ్డి నాగేశ్వరరావు, శీరంరెడ్డి వెంకటరమణ, నాయకులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

రావికమతం: పది లీటర్ల సారాతో పిల్లవానిపాలేనికి చెందిన ఎన్నంశెట్టి రామును అరెస్ట్ చేసినట్టు ఎస్ఐ ఉమామహేశ్వరరావు మంగళవారం తెలిపారు. గ్రామంలో సారా విక్రయిస్తున్నట్టు ముందస్తు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. అతడిని అరెస్ట్ చేసి పది లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

చిరుజల్లులతో రైతుల దిగులు



కె.కోటపాడు: రామచంద్రపురంలో..



బుచ్చెయ్యపేట: లోపూడిలో తడిచిన వరి పనలు



రోలుగుంట: పొలానికి పైపుతో మోటారు నీరు పెట్టుకుంటున్న రైతు

మాడుగుల రూరల్/కె.కోటపాడు: ఆకాశం మేఘావృతమై మంగళవారం ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తుండటంతో రైతులు దిగులు చెందుతున్నారు. ఖరీఫ్ వరి పంట పొట్ట దశకు చేరుకుంది. ఈ సమయంలో అకాల వర్షాలు కురిస్తే ఆరుగాలం కష్టపడి పండించిన పంటను పూర్తిగా నష్టపోతామని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మాడుగుల మండలంలో 12 వేల ఎకరాల్లో వరి పంట వేశారు. కొన్ని చోట్ల కోసిన వరి పంట హడావిడిగా కుప్పలు పెడుతున్నారు. పూర్తిగా పండిన పంటను వర్షాలకు భయపడి కోతలు కోయ్యడం వాయిదా వేశారు. కె.కోటపాడు మండలం రామచంద్రపురం, దాలివలస, కొరువాడ, పొడుగుపాలెం, రొంగలినాయుడుపాలెం తదితర గ్రామాల్లో రెండు రోజుల క్రితం కోసిన వరిపంట మడుల్లోనే ఉండటంతో గుబులు చెందుతున్నారు.

తడిసిన వరి పనలు

బుచ్చెయ్యపేట: మండలంలో మంగళవారం కురిసిన వర్షానికి వరి పంట తడిసింది. రైతులు వరి పంటను కోసి పొలాల్లో పనలుగా వేసి ఆరబెట్టి కుప్పలు పెడుతున్నారు. అకాలంగా కురిసిన వర్షానికి లోపూడి, లూలూరు, గంటికొర్లాం, పీడీ పాలెం, నిమ్మలోవ, కుముదాంపేట తదితర గ్రామాల్లో కోసి ఆరబెట్టిన వరి పనలు తడిచిపోయాయి. దాంతో రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

వర్షం కోసం ఎదురుచూపు

రోలుగుంట: మిగతాల కంటే రోలుగంట మండలంలో విభిన్న పరిస్థితి నెలకొంది. ఇక్కడ పలు గ్రామాల్లో మంగళవారం తేలికపాటి వర్షం పడటంతో పొలాలకు కొంత మేలేనని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 1,200 హెక్టార్లలో వరి సాగు చేపట్టారు. తర్వాత సకాలంలో వర్షాలు లేక 15 రోజులుగా రైతులు వరుణుడి కోసం చూస్తున్న తరుణంలో వాతావరణం మారి తేలికపాటి వర్షం పడింది. ఈ వర్షపు తడులు పంట భూమిలో నిలబెట్టుకునే ప్రయత్నంగా నీటి ఇంజిన్లతో పొలాలను తడుపుకున్నారు.

ఇంటి వద్దకే సంక్షేమాన్ని అందిస్తున్న సీఎం జగన్



నర్సీపట్నం: వేములపూడి-2లో జగనన్న గృహాలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సుర్ల రాజేశ్వరి



చౌడువాడలో బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ అనురాధ, ఎంపీపీ జగన్‌మోహన్



మాకవరపాలెం: గిడుతూరులో ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న అధికారులు, నేతలు



గొలుగొండ: చోద్యంలో జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

కె.కోటపాడు/బుచ్చెయ్యపేట/నర్సీపట్నం/గొలుగొండ/దేవరాపల్లి/చీడికాడ/మాడుగుల/రూరల్/మాకవరపాలెం/రోలుగుంట: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే... కార్యక్రమంపై గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ, అభివృద్ధి గురించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు గెలిపించాలని కోరుతున్నారు. ఇందులో భాగంగా నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లో పలు గ్రామ సచివాలయాల్లో నాలుగున్నరేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ లబ్ధి వివరాలతో కూడిన బోర్డులను మంగళవారం ఆవిష్కరించారు. పార్టీ జెండాలను ఎగురవేశారు. అక్కడే పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహించారు. కె.కోటపాడు మండలం చౌడువాడ -1లో వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, మాకవరపాలెం మండలం గిడుతూరులో ఇన్‌చార్జి ఎంపీడీవో సీతామహాలక్ష్మితో కలిసి వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రుత్తల శ్రీనివాస్, గొలుగొండ మండలం చోద్యంలో పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, రాష్ట్ర శెట్టిబలిజ సంఘం డైరెక్టర్ బొండల రాజు, రోలుగుంటలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పోతల లక్ష్మీ శ్రీనివాస్, బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, దేవరాపల్లి మండలం నాగయ్యపేటలో జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు, జేసీఎస్ మండల కన్వీనర్ కె.వి.రమణ చీడికాడ మండలం చుక్కపల్లిలో ఎంపీపీ కురచా జయమ్మ, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు ఈ కార్యక్రమం నిర్వహించారు. అర్జునగిరిలో వర్షపు చినుకుల్లోనూ ఇంటింట ప్రచారం చేశారు. నర్సీపట్నం మండలం వేములపూడి-2(మెట్టపాలెం) జగనన్న కాలనీల్లో గృహాలకు ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, వైస్ ఎంపీపీ తాతాబాబు ప్రారంభోత్సవం చేశారు. మాడుగుల మండలం ఎం. కోటపాడులో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ పల్లె నిద్ర చేశారు. సాగరం సచివాలయ పరిధిలో సర్పంచ్ కోట్ని జయమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.



మాడుగుల రూరల్: ఎం. కోటపాడులో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తున్న రాజారామ్, తదితరులు



చీడికాడ: అర్జునగిరిలో వర్షపు చినుకుల్లోనూ ఇంటింట ప్రచారం

తప్పులు లేని ఓటర్ల జాబితా లక్ష్యం

- నర్సీపట్నం ఆర్డీవో జయరాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

నర్సీపట్నం: తప్పులు లేని ముసాయిదా ఓటర్ల జాబితాను సిద్ధం చేయాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో హెచ్.వి.జయరాం పేర్కొన్నారు. ఆయన తన కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, నాలుగు మండలాల తహసీల్దార్లతో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ముసాయిదా ఓటర్ల జాబితాలో పొరపాట్లు ఉంటే సంబంధిత ఏఈఆర్వో, ఈఆర్వో, బీఎల్వోలకు తెలియజేయాలన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండాలన్నారు. చనిపోయినా లేదా శాశ్వతంగా వేరే ప్రదేశానికి వెళ్లిన వారి ఓట్లు తొలగించడానికి ప్రత్యేక ఫారాలను విడివిడిగా ఇవ్వాలని సూచించారు. ఆ సవరణలన్నీ పూర్తయిన తర్వాత ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా జనవరి 5న ఓటర్ల జాబితా ప్రచురిస్తామన్నారు. ఇద్దరు వ్యక్తులకు ఒకే ఫొటో నమోదైతే, ప్రాథమిక విచారణతో పరిష్కరించాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు దృష్టికి తీసుకువచ్చిన అంశాలపై క్షుణ్ణంగా పరిశీలన చేయాలని అధికారులను ఆదేశించారు. నర్సీపట్నం, గొలుగొండ, నాతవరం, మాకవరపాలెం తహసీల్దార్లు అన్నాజీరావు, ఆనందరావు, ఎస్.వి.ఎస్.శ్రీనివాసునాయుడు, వైఎస్సార్‌సీపీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మీసాల సుబ్బన్న, టీడీపీ నాయకుడు గవిరెడ్డి వెంకటరమణ, బీజేపీ నాయకుడు అడిగర్ల సతీష్ పాల్గొన్నారు.

‘ఏపీ వై నీడ్స్ జగన్’ నేడు

దేవరాపల్లి/చీడికాడ: దేవరాపల్లి మండలం పెదనందిపల్లిలో చీడికాడ మండలం జి.కొత్తపల్లిలో ‘ఏపీ వై నీడ్స్ జగన్’ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు బూరె బాబూరావు, గొల్లవిల్లి రాజుబాబు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల నేతలు, హాజరు కావాలని కోరారు.